ప్రజాశక్తి
మంగళవారం 5 ఆగస్టు 2025 5 అనంతపురం

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాల్లో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పరమేష్

విద్యా సమస్యలపై పోరాటం

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీలో నాయకుల పిలుపు

ప్రజాశక్తి-శింగనమల

ప్రభుత్వ విద్య పరిరక్షణ, విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్లీనరీ సమావేశాలు సోమవారం నాడు శింగనమలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వందల మంది విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓతురు పరమేష్ మాట్లాడుతూ విద్యార్థి సమస్యలపై ఎస్ఎఫ్ఐ స్వార్థంగా రాజీలేని పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, పాఠ్యపుస్తకాల కోసం ఎస్ఎఫ్ఐ అనేక రకాలుగా ఉద్యమాలు నిర్వహించి విజయం సాధించిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం విద్యను కాషాయీకరణం చేసే కుట్ర చేస్తోందన్నారు. ఇలాంటి వాటిని అడ్డుకోవాల్సిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి వంతపాడుతూ ఆ విధానాలను అమలు చేసే నిర్ణయాలు చేయడం విచారకరం అన్నారు. దొంగ జీవోలు ఇచ్చి విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలను రానీకుండా చేసేలా రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గపు చర్యలు తీసుకుంటోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భావ ప్రకటన స్వేచ్ఛను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాల నాయకులు వెళ్లరాదంటూ తీసుకొచ్చిన జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా రాష్ట్ర నాయకులు వైటిసి.రమేష్, బంగి శివ, జిల్లా నాయకులు తరిమెలగిరి, రాచపల్లి సూర్య ప్రకాష్, భీమేష్, శివ, వెంకటేష్, వంశి, అరుణ్ రషీద్, నవీన్, ధనుష్, రాజేష్ పాల్గొన్నారు.

భూ గుబులు...!



అనంతపురం నగరం చుట్టు పక్కల భూ యజమానుల్లో కంటి కునుకులేకుండాపోతోంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కొంత మంది కబ్జాకు కర్చీఫ్ వేసేస్తున్నారు. ఈ భూమి తమదేనంటు ఖాళీ స్థలంలో వాలిపోతున్నారు. పదుల సంఖ్యలో జనం గుమికూడి జెసిబిలతో చదును చేసే కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో తమ అన్ని రకాల పత్రాలున్నాయి... తమదే భూమి అని భావిస్తూ వచ్చిన భూ యజమానులకు కంటిమీద కునుకులేకుండాపోతోంది. అధికార బలంతో కొంత మంది నేతలు ఈ రకమైన దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు పెద్దఎత్తున వెల్లువెత్తుతున్నాయి. వరుసగా వెలుగులోకి వస్తున్న ఘటనలు సర్వత్రా ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

- ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా
- బెంబేలెత్తిపోతున్న భూ యజమానులు
- వెంచరేసినా కప్పం కట్టాల్సిందే..

అధికార పార్టీ నేతల భూములకే ఎసరు

అనంతపురం నగర శివారులోని ఎంకెఎం ఫంక్షన్ హాలు సమీపంలో సర్వేనంబరు 209, 210లో అధికార పార్టీకి చెందిన నాయకులే గతకొన్నేళ్ల క్రితం కొనుగోలు చేశారు. ఈ స్థలంపై కొంత మంది అధికారపార్టీ నేతల కన్నుపడింది. ఆ భూమి తమదేనంటూ కబ్జాకు దిగినట్టు ఇటీవలనే పెద్దఎత్తున చర్చ జరిగింది. దీనిపై సదరు అధికారపార్టీ నేతలుగానున్న భూ యజమానులు తమ భూమినే కబ్జా చేస్తున్నారంటూ ఏకంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు ఉత్తరం రాసి తమ సమస్యను మొరపెట్టుకున్నారు. ఇది పెద్దఎత్తున మీడియాలోనూ చర్చ జరిగింది. దీనిపై తదుపరి చర్యలు ఏ విధంగా ఉండనున్నాయన్నది చూడాల్సి ఉంది.

దాడి చేసి కబ్జా

అనంతపురం నగరంలోని కక్కలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 242 సర్వే నంబరులో మూడున్నర ఎకరాల భూమి ఉంది. స్థలం ఖాళీగా కనిపించడంతో వివాదముందంటూ అధికారపార్టీకి చెందిన కొందరు నేతలు రంగంలోకి దిగారు. అడ్డుకోబోయిన భూ యజమానులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీనిపైనా బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఎన్నో ఏళ్లుగా తమ పరిధిలోనున్న భూమిని రాత్రికిరాత్రి కొంత మంది వచ్చి తమదంటూ దౌర్జన్యానికి దిగారంటూ బాధితులు అప్పట్లో ఆవేదన వ్యక్తం చేశారు.

మరో చోట అదే తీరు

అనంతపురం నగరం పరిధి కక్కలపల్లి సర్వే నంబరు 144లో 1.76 ఎకరాల భూమిని కొంత మంది వ్యక్తులు ప్లాట్లుగా కొనుగోలు చేశారు. సర్వే సమయంలో జరిగిన చిన్న పొరపాటును అడ్డుపెట్టుకుని కొంత మంది అధికారపార్టీ నేతలు రంగంలోకి దిగి ఆక్రమించే ప్రయత్నం చేశారు. దీనిపైనా బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

వెంచరేసినా కప్పం కట్టాల్సిందే

అనంతపురం శివారుల్లో ఎవరైనా వెంచరేసినా అధికారపార్టీ నేతలు రంగంలోకి దిగిపోతున్నారు. ఆ వెంచరేసేది అధికార పార్టీ నాయకులైనా సరే ముఖ్య నేతలకు కప్పం కట్టాల్సిందే. వెంచర్ విలువను బట్టి డబ్బులు చెల్లించాలి. లేకపోతే అంతే.. వారి పని అయినట్టే అన్న ఆరోపణలున్నాయి. ఇలా అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు భూ స్వాహాకు యత్నించడం, బెదిరింపులకు దిగుతుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఆ పార్టీ పెద్దలు ఇలాంటి వాటిపై దృష్టి సారించి వారిని నియంత్రించే చర్యలు తీసుకోవాలని పలువురు భూ బాధితులు కోరుతున్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

ప్రజాశక్తి-అనంతపురం

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలంటూ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.శ్రీరామ్ సూచించారు. సోమవారం స్థానిక ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం అధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం, దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్వి కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన కోసం కృషి చేయాలన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్ వాడకానికి అలవాటు పడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ ఎం.సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి ప్రసాద్, లీగల్ టీం ఎస్ఐ బి.హనుమంతు, ఎక్సైజ్ ఎస్ఐలు జయనరసింహా, జాకీర్‌హుస్సేన్, నరేష్, ఎన్ఎస్ఎస్ పిఒ జి.ఆనంద్‌బాబు, సుదర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నాడు జర్నలిస్టుల డిమాండ్స్ డేను పురస్కరించుకుని ఏపీడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు షఫీ, ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ శివనారాయణ శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేపటి రామాంజినేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల ఇంటిస్థలాల కేటాయింపుతో పాటు జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇతర సదుపాయాలపై మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. బీహార్ తరహాలో జర్నలిస్టులకు 15వేల పెన్షన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. సమాచార శాఖను బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కొత్త అక్రిడిటేషన్లను వెంటనే ఇవ్వాలన్నారు. ఈ నెల 6వ తేదీన జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ అంశాలన్నింటినీ చర్చించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు జయప్రకాష్, డాక్టర్ సూర్య, వేణుగోపాల్, విజయ్ కుమార్, సుధాకర్, బన్సీలాల్ నాయక్, కేశవ, దాదాపీర్, రాజారెడ్డి, పవన్, శింగనమల ప్రసాద్, నాగేంద్ర పాల్గొన్నారు. తాడిపత్రిలోనూ ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మకు వినతపత్రం అందజేస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

కార్పొరేషన్ 'రెవెన్యూ'లో విభేదాలు

- ఆర్ఐలు, ఆర్వోలు తలోదారి
- పోటీ పడి మామూళ్ల వసూళ్లు
- కమిషనర్‌కు తలనొప్పిగా ఆ విభాగం
- 'రెవెన్యూ'పై బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో కొందరు ఆర్ఐలు ఆర్వోలకు నడుమ విభేదాలు భగ్గుమన్నాయి. ఆ విభాగంలో ఒకరిని చూస్తే మరొకరికి సరిపోని పరిస్థితి కన్పిస్తోంది. ఫలితంగా టైటిల్ ట్రాన్స్‌ఫర్లు, మ్యుటేషన్లు కోసం దరఖాస్తు చేసుకున్న గృహాల కొనుగోలుదారులు, గృహ యజమానులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఆ విభాగం అధికారులు పోటీలు పడి గృహ యజమానుల ముక్కు పిండి కాసులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మామూళ్లు ముట్ట చెప్పని వారి మ్యుటేషన్ దరఖాస్తులో యజమాని పేరు నమోదు చేయకుండా గృహాలు, ప్లాట్లను అమ్మిన వారి పేరు మీదనే సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయి. ఈ విషమంపై పలువురు బాధితులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. మ్యుటేషన్‌కు సంబంధించి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, రెవిన్యూ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలి. తనిఖీల అనంతరం సంతకాలు చేసిన ఫైళ్లను ప్రాసెసింగ్ చేస్తూ డిప్యూటీ కమిషనర్‌కు పంపుతారు. కాగా డిప్యూటీ కమిషనర్‌ను సైతం మభ్యపెట్టి దరఖాస్తు చేసుకున్న వారి పేర్ల స్థానంలో గృహాల అమ్మిన వారి పేర్లనే నమోదు చేసి సర్టిఫికెట్ జారీ చేయటం గమనార్హం. బాధితుల ఫిర్యాదుతో డిప్యూటీ కమిషనర్ పావని ఈ అంశంపై దృష్టి సారించారు. తన దృష్టికి ఈ విషయాలు తీసుకురాకుండా తన సంతకం ఎలా చేయించారో అర్థం కావడం లేదని ఆమె విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో కాసులు ముట్ట చెప్పనిదే పనులు జరగటం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న వారంతా ఆరు నెలల క్రితం జరిగిన బదిలీల్లో వచ్చారు. ఇంత స్వల్ప వ్యవధిలోని విభాగంలో ఒకరంటే ఒకరికి సరిపోకుండా వ్యక్తిగత నిర్ణయాలతో విధులు నిర్వహిస్తూ పోతున్నారు.

కమిషనర్‌కు సైతం తలనొప్పి..!

కార్పొరేషన్ రెవెన్యూ విభాగం పనితీరు కమిషనర్ బాలస్వామికి సైతం తలనొప్పులు తెచ్చిపెడుతోంది. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, రెవెన్యూ ఆఫీసర్లు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. వీరి ఫిర్యాదుల నేపథ్యంలో వారిని ఎలా సక్రమంగా విధుల్లో ఉంచి పనులు చేయించుకోవాలో తెలియక ఉన్నతాధికారికి తలపట్టుకుంటున్నారు. గత మార్చి నెలలో మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరినారాయణ నగరంలో కొన్ని భవనాలను తనిఖీ చేశారు. ఈ సమయంలో నూతన భవనాలకు కొలతల ప్రకారం ఆస్తి పన్ను విధించకుండా నిబంధనలు ఉల్లంఘించిన విషయం బహిర్గతం అయ్యింది. ఆస్తి పన్ను వివరాలను నమోదు చేసే ఈఆర్‌పి మాడ్యూల్‌కు నకిలీ వెబ్‌సైట్ సృష్టించి మున్సిపల్ కార్పొరేషన్ పన్ను ఆదాయానికి గండి కొట్టిన విషయం వెలుగు చూసింది. ఈ నేపథ్యంలో నగరంలోని 280 భవనాల కొలతలను ఇతర మున్సిపాల్టీల నుంచి డిప్యూటీ చేసిన రెవెన్యూ ఉద్యోగుల చేత తనిఖీలు చేయించి వివరాలు అప్లోడ్ చేయించారు. కార్పొరేషన్‌లో కీలకమైన రెవెన్యూ విభాగంలో శృతి మించుతున్న కొందరు ఉద్యోగుల వ్యవహార శైలి కార్యాలయానికి మచ్చ తెస్తోందని భావన ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో జరుగుతున్న అక్రమాలు, అధికారుల మధ్య ఆధిపత్య పోరును సరిదిద్దే చర్యలు చేపట్టాలన నగరవాసులు కోరుతున్నారు.

స్వీపర్లు, సెక్యూరిటీ గార్డు సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా.. కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న స్వీపర్లు, సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆసుపత్రిలో ధర్నా నిర్వహించారు. అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న స్వీపర్లు, సెక్యూరిటీ గార్డుకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. అలాగే ఇపిఎఫ్, ఇఎస్ఐ కూడా అమలు చేయలేన్నారు. అంతేగాకుండా నలుగురు చేసే పనులను ఒకరితో చేయిన్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే డ్రెస్ కోడ్ పాటించాలని, ఐడి కార్డులు ఇవ్వాలని పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.18,500 వేతనం ఇవ్వాలని, మహిళలపై మేనేజర్ల దాడిని నివారించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 15వతేదీ నుంచి పోరాటాలు చేపడుతామని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎపి ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ యూనియన్ సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు నల్లమ్మ, నాగలక్ష్మి, కమిటీ సభ్యులు ఉమాదేవి, భానుశేఖర్ , జుబేదా బేగం, రేఖ, మల్లికా, ఓబులమ్మ, పద్మావతి, రుక్మి బాయ్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులు

వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీలకు మెరుగైన ఫోన్లు అందించాలి

అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మేరీ

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రస్తుతం తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్లకు నెట్‌వర్క్ సక్రమంగా పని చేయడం లేదని, వెంటనే నెట్‌వర్క్ సక్రమంగా ఉన్న ఫోన్లను అందించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి మేరీ కోరారు. అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం రాయదుర్గం ప్రాజెక్టులోని అంగన్వాడీ వర్కర్లందరూ తమ ఫోన్లను ఐసిడిఎస్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సురేష్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఫోన్‌లకు నెట్‌వర్క్ సక్రమంగా అందకపోవడంతో తీవ్రమైన అంతరాయం ఏర్పడుతోందన్నారు. ముఖ్యంగా యాప్‌ల్లో చేయాల్సిన పనులు చేయలేకపోతున్నారన్నారు. గతంలో కూడా అనేకసార్లు ఈ సమస్యను ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే అంగన్వాడీ వర్కర్లకు మెరుగైన మొబైల్ ఫోన్లను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతపై అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి- అనంతపురం

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న జెఎన్‌టియు, ప్రభుత్వ ప్రతినిధులు

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అనంతపురం జెఎన్‌టియు సాంకేతిక సహకారం తీసుకోనుంది. ఈమేరకు ఇందుకు అనుగుణంగా సోమవారం సాయంత్రం విజయవాడలోని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ కార్యాలయంలో పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, అకాడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ఎస్వి సత్యనారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి శేషగిరిరావు అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా యూనివర్సిటీలోని కెమికల్, మెకానికల్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ నైపుణ్య అధ్యాపకులతో పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన కార్యక్రమాలు పర్యవేక్షించడం జరుగుతుంది. అనంతపురం జెఎన్‌టియులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మరియు జేఎన్టీలో ఉన్న సేఫ్టీ ఎక్విప్మెంట్ వాడుకుని పరిశ్రమల్లో ఎలాంటి సేఫ్టీ ఎక్విప్మెంట్ ఉపయోగించాలి ప్రమాదాలు జరిగితే ప్రమాదాలు జరగడానికి కారణాలు క్షుణ్ణంగా అధ్యయనం చేయడం కోసం కెమికల్ ఇంజనీరింగ్ మెకానికల్ ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ నైపుణ్య అధ్యాపకులను రాష్ట్ర పరిశ్రముల శాఖ ఉపయోగించు కోవడం జరుగుతుందని అన్నారు. వీటితోపాటు జెఎన్‌టియు ఎక్స్పర్ట్ టీం సేఫ్టీ ఆడిట్ రిపోర్ట్స్ ను పరీక్షించడం అధ్యయనం చేయడం దానికి కావలసిన చర్యలు మార్పులు చేయడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అడిషనల్ సెక్రటరీ గంధం చంద్రుడు కార్మిక శాఖ నుంచి మోహన్ రావు, ఉష్మశ్రీ తదితరులు పాల్గొన్నారు

జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలి

వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

దయనీయ స్థితిలో ఉన్న జిల్లా రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు రైతాంగ సమస్యలపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌ఛార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అతివృష్టి, అనావృష్టి జిల్లా రైతాంగం పెద్దఎత్తున నష్టపోయిందన్నారు. జూన్, జూలై మాసాలు పూర్తయినా చినుకు జాడ లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 8.50 లక్షల ఎకరాలు ఉంటే కేవలం 3.26 లక్షల మాత్రమే పంటలు సాగు చేశారు. ఇప్పటికే కార్తెలన్నీ అయిపోయాయన్నారు. మరోవైపు బోర్లలో నీరు ఇంకిపోయి ఉద్యాన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు ధైర్యం చెప్పేవారే లేకుండా పోయారన్నారు. ఆలస్యంగా వర్షాలు పడినా..ఒక వేళ వర్షాలు పడకపోయినా ఏం చేయాలన్న ఆలోచన చేయకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. బోర్ల కింద, హెచ్ఎల్‌సీ, హంద్రీనీవా కింద వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేసుకుంటే యూరియా, డీఏపీ లభించడం లేదన్నారు. మరోవైపు తుంగభద్ర డ్యాం పొంగిపొర్లుతున్నా ఇప్పటి వరకు హెచ్ఎల్ నార్త్, సౌత్ కెనాల్‌కు నీరు వదలకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 250 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. జిల్లాలో 46 మంది ఆత్మహత్య చేసుకుంటే ఇంత వరకూ ఆయా కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించలేదన్నారు. ఆయా సమస్యలపై రానున్న రోజుల్లో పోరాటాలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైసిపి నాయకులు ఏరాశి నారాయణరెడ్డి, ఉదయ్ కుమార్, గౌని ఉపేంద్రరెడ్డి, నరేంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, వెన్నం శివారెడ్డి, పుల్లయ్య, జానీ, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, నీలం భాస్కర్, భాస్కర్‌రెడ్డి, చెన్నంపల్లి వెంకటరెడ్డి, కొత్తపల్లి నాగలింగారెడ్డి, పురుషోత్తం, శ్రీనివాసులు, సుంకిరెడ్డి, నారాయణస్వామి, కసిరెడ్డి కేశవరెడ్డి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

జిల్లాస్థాయి పారా అథ్లెటిక్స్‌కు 40 మంది ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జూనియర్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ జిల్లా స్థాయి పోటీలకు 40 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న నిర్వహించిన జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ డిస్టిక్ లెవెల్ సెలక్షన్‌లో 100 మందికి పైన హాజరయ్యారని తెలిపారు. అందులో నుంచి మంచి ప్రతిభ కనబరిచిన వారిని 40 మంది ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదిన స్టేట్ లెవెల్ జూనియర్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ విశాఖపట్నం పోలీస్ బ్యాక్ గ్రౌండ్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మంచి ప్రతిభ కనబరిచి ఉమ్మడి అనంతపురం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

పోలీసులకు విద్యార్థి సంఘాల అభినందన

రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్‌ను అభినందిస్తున్న విద్యార్థి యువజన సంఘాల ప్రతినిధులు

ప్రజాశక్తి-రాయదుర్గం

అంతర్జాతీయ అంతర్జాల దోపిడీని ఛేదించి రాష్ట్రానికే వన్నెతెచ్చిన పోలీసుల కృషి ఎనలేనిదని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కావలి కోట్రేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు భంగి శివ కొనియాడారు. రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో సైబర్‌క్రైమ్ కేసును ఛేదించిన రాయదుర్గం పోలీస్‌ఇన్స్‌పెక్టర్ జయనాయక్‌ను స్థానిక కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ కేసులే కాకుండా పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తున్న జిల్లా పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కుమార్, నాగయ్య, గౌతమ్, రాజు, మనోజ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'అమిలినేని'ని కలిసిన అపుస్మా నాయకులు

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో అపుస్మా నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

కళ్యాణ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును జిల్లా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (అపుస్మా) నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అపుస్మా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు తప్ప ఇతర సమూహాలు ప్రవేశించేదుకు వీలు లేకుండా జీవో తీసుకురావడం అభిందనీయమన్నారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షులు మోక్షిత్ సుబ్బారెడ్డి, కార్యదర్శి రవిశంకర్ ప్రసాద్, స్టేట్ కోఆర్డినేటర్ కుసుమ పుల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గాజులు చంద్ర, నాయుడు, నాగరాజు, సూర్యనారాయణరెడ్డి, మోహన్, నాయకులు కొత్తపల్లి బాబు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

కళ్యాణదుర్గం రూరల్ : స్థానిక ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళ్యాణదుర్గంలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.హర్షలత సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్, కామర్స్ సబ్జెక్టులు బోధించేందుకు లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కావున అర్హులైన అభ్యర్థులు ఈనెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ముర్రుపాలు పిల్లలకు అమృతం

ప్రజాశక్తి-అనంతపురం

పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు పట్టిస్తే అమృతంలా పని చేస్తాయని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ సూచించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు-2025 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లాలు ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకూ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలు, ఆవశ్యకతను వివరిస్తున్నట్లు చెప్పారు. తల్లిపాలకు మద్దతునిచ్చే స్థిరమైన వ్యవస్థలను ఏర్పాటు చేసి తల్లిపాల సంస్కృతి ప్రోత్సాహానికి ప్రాధాన్యత ఇద్దామని పిలుపునిచ్చారు. తల్లిపాలు బిడ్డ హక్కు అన్నారు. అంతేగాకుండా తల్లి పాలు ఇవ్వడం వలన బిడ్డకే కాదు, తల్లికి కూడా శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా రక్షణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోల, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఐసిడిఎస్ పీడీ నాగమణి, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు పట్టిస్తే అమృతంలా పని చేస్తాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మధుమాలిని సూచించారు. సోమవారం మండల పరిధిలోని బొందలవాడ-2 అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యత. ఆవశ్యకతపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు త్రునిత, భాగ్యలక్ష్మి, లక్ష్మీనరసమ్మ, పద్మావతి, హెల్పర్ జ్యోతి, రామలింగమ్మ, చిన్నపిల్లల తల్లులు, గర్భిణులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇందుకు సంబంధించిన కరపత్రాలను తహశీల్దార్ బాలాజీరాజ్ ఆవిష్కరించారు. అనంతరం తల్లిపాల ఆవశ్యకతపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శకుంతల, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఇఒఆర్‌డి సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు

పామిడి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం తల్లిపాల

గుంతకల్లులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జె.పద్మావతి

తల్లిపాల వారోత్సవాల పోస్టర్లు విడుదల

పోస్టర్లను విడుదల చేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

వారోత్సవాలకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. అలాగే పామిడి అంగన్వాడీ-2లో అంగన్వాడీ టీచర్ జెఎల్ నారాయణమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ ఉషారాణి తల్లిపాల విశిష్టతపై వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణమ్మ, రామలక్ష్మమ్మ, డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణ, ఇరిగేషన్ అధికారి కిషోర్, ఎపిఎం నల్లప్ప, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సురేఖ, ఆర్ఐ గాయత్రి, వీఆర్వోలు జోష్ణ, పరంజ్యోతి, భాగ్యమ్మ, గోపాల్‌రెడ్డి, ఎఎన్ఎం ఉమాదేవి, ఆయా లక్ష్మీదేవి, ఆశావర్కర్లు వసంత, పద్మావతి, తల్లులు, పిల్లలు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : స్థానిక ఆర్‌డిటి కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ వసంతబాబు, ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న, అధికారులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల పరిధిలోని ప్రధాన రహదారిపై ఐసిడిఎస్ సిబ్బంది, తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మునివేలు, మండల విద్యాధికారి మల్లికార్జున, ఐసిడిఎస్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లతో కలిసి సోమవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద టీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుంతకల్లు : పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జె.పద్మావతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో అసిస్టెంట్ కమిషనర్ మల్లెల లక్ష్మీదేవితో కలిసి తల్లిపాల వారోత్సవాల గోడపత్రికలను విడుదల చేశారు. అనంతరం స్థానిక కొత్త కొట్టాల 2వ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం విద్య, ఎంఎస్‌కెలు సబీనా, తేజస్విని, ఎడబ్ల్యుడబ్ల్యు బృందా, ఎడబ్ల్యూహెచ్ హేమలత, ఆశావర్కర్ కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం

నేత్రాలను అందజేస్తున్న గోపాల్ కుటుంబ సభ్యులు

అనంతపురం కలెక్టరేట్ : మరణం తర్వాత కూడా మనం బతకి ఉండాలంటే అవయవాల దానంతోనే సాధ్యమని ఓ కుటుంబం చాటుకుంది. ఆకస్మిక మరణంతో అనంతపురంలోని భవానీనగర్‌కు చెందిన ఎక్కలూరి గోపాల్ (73) మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు గోపాల్ నేత్రాలను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆఫ్తాలమిక్ ఆఫీసర్ రాఘవేంద్ర, ఎక్కలూరి గోపాల్ భార్య రామసుబ్బమ్మ, పెద్ద కుమారుడు జెవివి జిల్లా నాయకులు వై.రామకృష్ణ, చిన్న కుమారులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.బాలకృష్ణ, కోడళ్లు సువర్ణ, రమా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌కు ఎంపి అంబికా శుభాకాంక్షలు

అనంతపురం కలెక్టరేట్ : గోవా రాష్ట్రం నూతన గరవ్నర్‌గా నియమితులైన పూపసాటి అశోక్ గజపతి రాజును అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ సోమవారం న్యూ ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి తన అభిమానాన్ని ఎంపి కలిసి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

ప్రాణాలు కాపాడిన వైద్యునికి సన్మానం


డాక్టర్‌ను సన్మానిస్తున్న రామాంజనేయులు కుటుంబ సభ్యులు

గుత్తి : గుండెనొప్పితో ప్రభుత్వాసుపత్రికి వచ్చిన ఓ వ్యక్తికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడిన వైద్యుడిని సోమవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన జి.రామాంజనేయులుకు గత నెల 15న గుండెనొప్పితో గుత్తి ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. వెంటనే స్పందించిన డాక్టర్లు చికిత్స అందించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించి హార్ట్ స్టెంట్ వేశారు. చికిత్స అందించిన అనంతరం రామాంజనేయులు పూర్తిగా కోలుకున్నారు. దీంతో కుటుంబ సభ్యులు వైద్యుడు రాజేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రభుత్వాసుపత్రిలో సత్కరించారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్ప, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల కుటుంబాలకు ఆర్థికసాయం

చెక్కు అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈఏడాది జూన్‌లో వేర్వేరుగా అనారోగ్యంతో మృతిచెందిన ముగ్గురు హోంగార్డుల కుటుంబాలకు ఎస్పీ పి.జగదీష్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆర్థికసాయం అందించారు. మరణించిన హోంగార్డు లక్ష్మిరెడ్డి కుటుంబానికి తోటి హోంగార్డుల నుంచి ఒకరోజు వేతనం రూ.5,11,200, ప్రభుత్వం నుంచి బరియల్ ఛార్జెస్ కింద రూ.10 వేలు, బి.తిరుపాల్‌నాయక్, నరసింహులు కుటుంబాలకు బరియల్ ఛార్జెస్ కింద రూ.10 వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు పవన్ కుమార్, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని వినతి

పెద్దపప్పూరు : జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఎపి చేనేత సంఘం నాయకులు చింతా పురుషోత్తం కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్లార్ బాలాజీరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ చేనేత సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దరిచేరవని సర్పంచు మల్లెల వనితా మల్లికార్జున అన్నారు. సోమవారం సంతేకొండాపురం పంచాయతీ సచివాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సర్పంచు మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల పరిసనాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఇళ్లముందు నీరు వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు ఓబులేసు, పంచాయతీ కార్యదర్శి అనిత, ఎంఎల్‌హెచ్‌పి సల్మా, ఎఎన్ఎం మల్లేశ్వరి, వెటర్నరీ అసిస్టెంట్ ప్రియాంక, మహిళా పోలీస్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

నా రిజిస్టరు విక్రయపత్రం నెం.1089/2005 తేది:11.07.2005 గల రాయదుర్గం సబ్‌రిజిస్టర్ ఆఫీసు నందు రిజిస్టర్ అయినది. సదరు ఒరిజినల్ విక్రయ పత్రము పోగొట్టుకుపోయినది. ఎవరికైనా దొరికినచో క్రింది అడ్రసుకు తెలుపువలెను. నకలు కాపికై దరఖాస్తు చేసినాను. ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నచో క్రింది అడ్రసుకు తెలుపువలెను.

ఇట్లు,
కె.యల్లప్ప,
మురడి గ్రామం, డి.హీరేహాల్ మండలం,
అనంతపురం జిల్లా. సెల్ నెం:6303101612

మహారాజ శ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.No.423/2024
Between:
P.Mohan ...Plaintiff
And
Koneti Ravi Shankar ...Defendant
ప్రతివాదికి నోటీసు

పై నెంబర్ గల దావాలో వాది తనకు రావలసిన దావా ప్రోమిసోరి నోట్ బాకీ రాబట్టు నిమిత్తము పై తెలిపిన కోర్ట్ నందు నీ పై దావా దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో నీ యొక్క హాజరు నిమిత్తము తేది :13-08-2025 న సదరు కోర్ట్ వారు వాయిదా వేసి వున్నారు. కావున నీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల మీరు స్వయంగా కాని వకీలు ద్వారా కాని ఉదయం 10:30 గంటలకు హాజరు కావలయును. లేని ఎడల నీ పరోక్షము నందు దావా తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియచేయడమైనది..

వాయిదా : 13-08-2025
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు,
K.S.PRABBHU KUMAR,
V.MURALI KRISHNA,
K.VENKATA REDDY,
V.GOWRI,
వాదిపరం న్యాయవాదులు,తాడిపత్రి.
సెల్ నెం:9849637883.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, GOOTY
E.P. No. 01/2023 in O.S.No:151/2014
Between:
K. Bhaskar Reddy. ...Petitioner/ D.Hr
V/S
B. Sree Ramulu died by L.Rs
Basineni Nagamani and Others
...Respondants / J.Drs
J.Dr 1,2 and 3 కు Order 21 Rule 64 and 66 CPC Notice
J.Dr 1:Basineni Nagamani W/o. Late. B. Sree Ramulu,
J.Dr 2: Basineni Karthikeya S/o. late, B. Sree Ramulu, Minor
J.Dr 3: Basineni Jyothi Swaroop S/o. late. B.Sree Ramulu Minor
All are Residents of D.No. 10/263.Tadipatri Town, Anantapur District.

డిక్రీహోల్డరుకు రావలసిన ఇ.పి మొత్తము వసూలు చేయుటకు గాను ఇ.పి.లోని షెడ్యూలు ఆస్తిని జప్తు చేసి యున్నారు. సదరు ఇ.పి వేలము షరతులు నిర్ణయంచుటకు మీ యొక్క హాజరు నిమిత్తం 11/08/2025వ తేదిన వాయిదా వేసినారు. అందుకు మీకు ఆక్షేపణలున్న యెడల సదరి దినం ఉదయం 10:30 గం॥లకు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టుయందు హాజరు కావలెను లేని యెడల మీ పరోక్షమునందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
T.Dhanunjaya, Advocate, Gooty.

ఇంటింటికీ చంద్రబాబు మోసం

కరపత్రాలను అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-నార్పల

ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తున్నట్లు వైసీపీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ ఖదర్ వలిఖాన్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని గొల్లపల్లి, సిద్ధిరాచెర్ల, దుర్గం, బండ్లపల్లి గ్రామాల్లో 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టోపై చేస్తున్న మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వేదాంతం నాగరత్నమ్మ, నాగేశ్వరావు, శంకర్‌యాదవ్, రాజారెడ్డి, రామాంజనేయులు, బండ్లపల్లి రామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శ్రీరాములు, బయపురెడ్డి, నారాయణరెడ్డి, పక్కిరెడ్డి, శివారెడ్డి, పాపయ్య, యలప్పనాయుడు, పోలయ్య, లక్ష్మిరెడ్డి, నాగలింగారెడ్డి, వెంకటేష్, సూర్యనారాయణ, మన్నీల శివయ్య, దాడితోట బాష, బాలనాగి బయన్న, అమీర్‌బాషా, గుత్తి గోపాల్‌రెడ్డి, బాలనాగి రామాంజనేయులు, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

యాడికిలో ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి పర్యటన

ప్రజాశక్తి-యాడికి

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సోమవారం మండలంలో ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. పాఠశాల ఆవరణ తిరుగుతూ కొన్ని మరుగుదొడ్లకు తలుపులు సరిగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. అనంతరం కమలపాడు రోడ్డు లోని ముస్లిం షాదీ ఖానా, సంత మార్కెట్లోని వారపు సంత, కళ్యాణ మండపాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, మండల కన్వీనర్ రుద్రమనాయుడు, సొసైటీ సింగిల్‌విండో అధ్యక్షులు చలమారెడ్డి, విజన్ స్కూల్ విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్, గుండా నారాయణస్వామి, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు తాండ్ర విక్రమ్, రవికుమార్‌రెడ్డి, బీసీ సెల్ మండల కన్వీనర్ తిరంపురం నీలకంఠ, మాజీ ఎంపిటిసి దడియాల ఆది, టిడిపి నాయకులు ఆదినారాయణ, నాగశేఖర్, చాంద్‌బాషా, తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధులపై శిక్షణ


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో క్యాన్సర్ వ్యాధులపై (ఎన్‌సిడి 4.0) సోమవారం జిల్లాస్థాయి అవగాహన శిక్షణ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సెకండరీ హెల్త్‌సేవల్లో పని చేస్తున్న గైనకాలజీ, ఒబిజి, ఇతర నిపుణులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా అసంక్రమిత వ్యాధుల గుర్తింపు, క్యాన్సర్ వ్యాధులు, నిర్వహణ, ఇంటింటి సమగ్ర సర్వే విధానాలు, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్లపై హన్స్ ఆన్ ట్రైనింగ్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఇబి దేవి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ షారన్‌సోనియా, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ ఆత్మారాం, వైస్ ప్రిన్సిపాల్ టి.మధుసూదన్, ఇఎన్‌టి విభాగం డాక్టర్ రాజేష్, జిల్లా ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం ఆఫీసర్ జి.నారాయణస్వామి, నోడల్ ఆఫీసర్లు సెకండరీ హెల్త్ డాక్టర్ మిథున్, రాకేష్, గీత, యశోద, నరేష్, బాలాజీనాయక్, వైద్య నిపుణులు డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, డాక్టర్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

డా॥ఆశావాది పురస్కారాలు ప్రదానం

సవ్వప్పగారి ఈరన్నకు సాహిత్య పురస్కారం-డా॥సమ్మెట మాధవరాజుకు అవధాన పురస్కారం

డాక్టర్ సమ్మెట మాధవరాజు దంపతులను అతిథులు

సవప్పగారి ఈరన్నను సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ సంవత్సరం పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు సాహిత్య పురస్కారం కర్నూలుకు చెందిన 'కవిచంద్ర' సవ్వప్ప గారి ఈరన్నకు, డాక్టర్ ఆశావాది అవధాన పురస్కారం అనంతపురానికి చెందిన అష్టావధాని డాక్టర్ సమ్మెట మాధవరాజుకు అందజేశారు. సోమవారం నాడు హైదరబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. ఆశావాది సాహితీ కుటుంబం ఆధ్వర్యంలో 'అవధానాచార్య' పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు 82వ జయంతి వేడుకలు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నిర్వహించారు. ఈ సంవత్సరం పద్మశ్రీ ఆశావాది ప్రకాశరావు సాహిత్య పురస్కారం 'కవిచంద్ర' సవ్వప్ప గారి ఈరన్నకు, ఆశావాది అవధాన పురస్కారం అష్టావధాని డాక్టర్ సమ్మెట మాధవరాజుకు అందజేశారు. పద్యప్రబంధ కవి అన్నమరాజు ప్రభాకరరావు సభాధ్యక్షత వహించారు. విజయసారథి, వడ్లూరి ఆంజనేయులు, నండూరి విద్యారణ్య స్వామి అతిథులుగా పాల్గొన్నారు. శతావధాని ఆముదాల మురళి, డాక్టర్ ఆశావాది సుధామ వంశీ, పురస్కార గ్రహీతలను పరిచయం చేశారు. ఉప్పలూరి ఆత్రేయ శర్మ, డాక్టర్ మల్లిపూడి రవిచంద్ర, యెల్చాల నర్సింహులు, ఆశావాది శిరీష వాణి, లక్ష్మీ మానస, శ్రీవల్లి, వసంతగౌరి తదితరులు పాల్గొన్నారు. అష్టావధాని సమ్మెట మాధవరాజు, తెలుగు సేత గావించిన జాంబవతీ పరిణయం పుస్తక పరిచయం కళారత్న ఆముదాల మురళి చేశారు.

పంట నమోదుపై సమీక్ష

బెలుగుప్ప : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ, ఈ పంట నమోదుపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవకు సంబంధించిన ప్రతిఅర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అలాగే ప్రతి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్, డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్, ఆర్ఐ నగేష్‌బాబు, విఆర్వోలు రమేష్, ఎర్రిస్వామి, ఈశ్వర్‌రెడ్డి, రాజశేఖర్, ఎర్రిస్వామి, సర్వేయర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్ఎ మృతికి నివాళి

యాడికి : అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని తూట్రాళ్లపల్లి గ్రామ విఆర్ఎ లింగాల రామకృష్ణ మృతికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచు, వైసిపి మండల కన్వీనర్ సంజీవరాయుడు, తదితరులు ఉన్నారు. కాగా విఆర్ఎ రామకృష్ణ అంత్యక్రియలకు భార్య నాగమ్మకు డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, రెవిన్యూ సిబ్బంది రూ.15వేల తక్షణసాయం అందజేశారు. రామకృష్ణకు ఇద్దరు కుమార్తెలు లక్ష్మీనారాయణమ్మ, సరస్వతి, ఇద్దరు కుమారులు గురుమూర్తి, సోమశేఖర్ ఉన్నారు.

పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలి

పెద్దవడుగూరు : పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం బ్యాంకు మేనేజర్ శేషగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు కత్తుల కొండయ్య, నాయకులు ఆదినారాయణ, కుమార్, ఈరన్న, రాజు, రంగస్వామి, సన్నగిరి, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అనంతపురం : పొగాకు ఉత్పత్తులను పూర్తిగా నిషేధించి పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దామని పొగాకు నియంత్రణ జిల్లా సామాజిక కార్యకర్త బి.శ్రీరాములు పిలుపునిచ్చారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా రుద్రంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ సిగరెట్టు, ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల అనేక దుష్పణామాలు ఎదురవుతాయన్నారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల పరిధిలోని దుకాణాల్లో సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదన్నారు. అతిక్రమించిన వారిపై సిఒటిపిఎ-2003 చట్టం ప్రకారం చర్య తీసుకోనున్నట్లు హెచ్చరించారు. అనంతరం పొగాకుకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్‌లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

బుక్కరాయసముద్రం : మండలంలోని రోటరీపురం పాఠశాలలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు 200 మందికి సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ జయరామ్, జనరల్ సెక్రటరీ డిఎస్పీ మహబూబ్‌బాషా, డైరెక్టర్లు నారాయణస్వామి, అనంతయ్య, సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత, ఉపాధ్యాయులు నాగరాజుగౌడ్, రామాంజనేయులు, కృష్ణమూర్తి, ఈశ్వరయ్య, రామునాయుక్, తదితరులు పాల్గొన్నారు.

గుడికి వెళ్లే దారి మూసివేత

పుట్లూరు : వందల ఏళ్ల నుంచి ఆలయానికి ఉన్న దారిని మూసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని కందికాపుల గ్రామానికి చెందిన ప్రజలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలో తహశీల్దార్‌తోపాటు సిఐ సత్యబాబును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని చింతకుంట నుంచి కడవకల్లుకు వెళ్లే దారిలో సుంకలమ్మ తల్లి ఆలయానికి గత కొన్నేళ్ల నుంచి దారి ఉందన్నారు. అయితే వారంరోజుల కిందట చింతకుంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ భూమి తనది అంటూ ఆలయానికి వెళ్లే దారిని మూసివేశాడన్నారు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

సేవ్ ఆర్డీటీ ర్యాలీ


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

పామిడి : ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ 'సేవ్‌ఆర్డీటీ' పేరుతో మండల వ్యాప్తంగా ఉన్న గిరిజనులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం చేరుకుని తహశీల్దార్ ఉషారాణికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సురేష్ నాయక్, సాకె గోవిందు, రమేష్ నాయక్, లాలూనాయక్, గిరిజన మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

కుందుర్పి : ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ ఓబులేష్‌ను ఎంపిపి కమలా సోమవారం స్థానిక కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పలు రైతు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భర్త నాగరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన

నార్పల : మండలంలో చేపట్టిన పంట నమోదు ప్రక్రియను తాడిపత్రి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకు రవి పరిశీలించారు. నార్పల రెవెన్యూ విలేజ్‌లో రైతులు టి.వెంకట శివారెడ్డి, జయరామిరెడ్డి సాగుచేసిన మొక్కజొన్న పంట నమోదు పరిశీలించి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చెన్నవీరస్వామి, రైతులు పాల్గొన్నారు.

డ్రైవర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ : ఉరవకొండ ఆర్టీసీ డిపోలో దినసరి వేతనం కింద పని చేసేందుకు తాత్కాలిక డ్రైవర్ల నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ హంపన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు, ఆర్‌డిఒ కార్యాలయం నుంచి లైసెన్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని తమకు అందచేయాలన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ఢీకొన్న రెండు లారీలు

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్లు గ్రామం వద్ద నెల్లూరు - అంకోల జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఎదురెదురుగా వచ్చిన రెండు లారీలు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ జితేంద్రకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న విడపనకల్లు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సమీక్షించారు. క్షతగాత్రులను గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని షిరిడీ సాయి ఆలయం వద్ద సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. చిట్టూరుకు చెందిన బిటెక్ విద్యార్థులు హరీష్, తరుణ్ సొంత పనుల నిమిత్తం పెద్దవడుగూరుకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఎదురుగా వచ్చిన ఇసుక టిప్పర్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు.